నారీమణుల నారాజ్

రెండు చీరలకు సర్కార్ మంగళం • అటకెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏడాది పాలన పేరుతో కాంగ్రెస్ నేతలు సంబురాల్లో మునిగి తేలుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు గొప్పలు సాధించామని చెప్పుకుంటున్నారు. కానీ రాష్ట్రంలో మహిళలు మాత్రం ప్రభుత్వ సంబురాలపై మండిపడుతున్నారు. హామీలు ఏమీ నెరవేర్చకుండా వేడుకలు చేసుకోవడమేంటని ప్రశ్నిస్తున్నారు. మహిళలకు ఇచ్చిన హామీల్లో ఏవీ కార్యరూపం దాల్చకపోవడాన్ని గుర్తుచేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం 'రెండు చీరల పంపిణీ' హామీని కూడా అటకెక్కించిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మూలుగుతున్న ప్రతిపాదనలు

స్వయం సహాయ బృందాల(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు రెండు చీరల చొప్పున ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. రాష్ట్ర చేనేత జౌళిశాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. కానీ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద మూలుగుతున్నాయి. అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఎస్‌హెచ్‌జీ మహిళలు ప్రశ్నిస్తున్నారు.

చీరల పంపిణీకి నిధులు లేవు!

రాష్ట్రంలో 'రెండు చీరల పథకం' అమలుకు ప్రభుత్వం మంగళం పాడిందా? కావాలనే తొక్కి పెట్టిందా? అని మహిళల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాల్లో దాదాపు 64 లక్షల మంది ఉన్నారు. ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున ఇవ్వాలంటే 1.30 కోట్ల వరకు చీరలు అవసరం. ఒక్కో చీరకు కనీసం రూ.500 ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ లెక్కన మొత్తం రూ.400కోట్లకు పైగానే బడ్జెట్ అవుతుందని ప్రతిపాదించారు. ఆరు గ్యారెంటీల హామీని అటకెక్కించిన కాంగ్రెస్ సర్కారు చీరల కోసం భారీ బడ్జెట్ కేటాయిస్తుందని నమ్మడం అత్యాశే అని మహిళా సంఘాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. చీరల తయారీ ఆర్డర్లు వస్తే ఉపాధి దొరుకుతుందని భావించిన నేతలు ప్రభుత్వం నుంచి స్పందన లేక ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరల ఆర్డర్లతో పని దొరికేదని, ఇప్పుడు ఉపాధి కరువైందని మండిపడుతున్నారు.

నైపుణ్యాల కేంద్రం.. హైదరాబాద్

- ఎమర్జింగ్ టాలెంట్‌లో అగ్రస్థానం
- ఉపాధి కల్పనలో రాష్ట్రానికి 7వ స్థానం
- ఇండియా స్కిల్స్ రిపోర్ట్‌లో వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): నైపుణ్యాల కలిగిన యువతకు కేంద్రంగా హైదరాబాద్ నగరం గుర్తింపు పొందింది. ఎమర్జింగ్ టాలెంట్ విభాగంలో జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ తర్వాతి స్థానాల్లో గుంటూరు, లక్నో నగరాలు నిలిచాయి. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ), అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సంయుక్తంగా ఇండియా స్కిల్స్ రిపోర్ట్ – 2022ను విడుదల చేశాయి. రాష్ట్రంలో ఉద్యోగ కల్పన రేటు 63 శాతం ఉండగా, హైదరాబాద్‌లో 64.7 శాతం ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది. ఉద్యోగ కల్పన రేటు ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఏడో స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. కాగా, దేశంలో ప్రస్తుతం ఏఐ, మెషిన్ లెర్నింగ్, డాటా సైన్స్, క్లౌడ్ ఇంజినీరింగ్ నైపుణ్యాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు ఈ నివేదిక పేర్కొన్నది.

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

పాలనా విధానాలు మార్చుకుంటేనే మనుగడ

- కాంగ్రెస్ సర్కారుకు మేధావుల హితవు
- ఒకే సామాజికవర్గం చేతిలో పాలన: మాస్టార్‌జీ

రవీంద్రభారతి, డిసెంబర్ 10: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలనా పద్ధతులు మార్చుకుంటేనే మనుగడ సాధించగలదని పలువురు మేధావులు, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన 'ప్రజల ఆకాంక్షలు – ఏడాది ప్రభుత్వ పాలన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ.. లగచర్ల, జైనూర్ ఘటనలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. హాస్టల్స్, గురుకులాలలో కలుషితాహార ఘటనలను నివారించాలని అన్నారు. రాష్ట్రంలో ఒకే సామాజికవర్గ పరిపాలన కొనసాగుతుందని గాయకుడు మాస్టార్‌జీ విమర్శించారు. తొమ్మిది మంది కళాకారులకు 300 గజాల స్థలం, కోటి రూపాయలు నగదు ఇస్తామని సీఎం ప్రకటించారని, లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో ప్రజలకు వెల్లడించాలని ఆయన కోరారు. రేవంత్ రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగులు, రైతులను పూర్తిగా విస్మరించిందని డాక్టర్ వివి రావు ఆరోపించారు. ఉచిత బస్సు పేరుతో మహిళలను అవమానిస్తున్నారని సామాజిక విశ్లేషకురాలు సజయ అన్నారు.

రాజుకున్న 'మంచు' కుంపటి.!

రోడెక్కిన కుటుంబ ఆస్తి తగాదాలు

మోహన్‌బాబు, మనోజ్‌పై కేసు నమోదు

- మోహన్‌బాబు ఇంటి వద్ద హైడ్రామా
- మనోజ్, విష్ణు బౌన్సర్ల మధ్య ఘర్షణ
- 'అల్లారుముద్దుగా పెంచితే గుండెలపై తన్నావు'
- మనోజ్‌ను ఉద్దేశించి మోహన్‌బాబు వ్యాఖ్యలు
- జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ మోహన్‌బాబు
- దాడిని ఖండించిన జర్నలిస్టు సంఘాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'మంచు' కుటుంబంలో విభేదాలు రచ్చకెక్కాయి. ఇంటి గొడవలు కాస్తా పోలీసు కేసులు, ఘర్షణలకు దారితీశాయి. దీంతో మంగళవారం జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి వద్ద రోజంతా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. మోహన్‌బాబు కుమారులు విష్ణు, మనోజ్ తరపున రంగంలోకి దిగిన బౌన్సర్లు బాహాబాహీకి దిగారు. బౌన్సర్ల సాయంతో మనోజ్ గేట్లు బద్దలుకొట్టి మరీ ఇంట్లోకి వెళ్లారు. ఈ క్రమంలో సహనం కోల్పోయిన మోహన్‌బాబు జర్నలిస్టులపై దాడికి పాల్పడటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. మరోవైపు పరస్పర ఫిర్యాదుల మేరకు మోహన్‌బాబు, ఆయన చిన్న కుమారుడు మనోజ్‌పై పహాడీషరీఫ్ ఠాణాలో కేసులు నమోదయ్యాయి.

ప్రైవేటు సైన్యాన్ని దింపిన అన్నదమ్ములు

తండ్రీకొడుకులు సోమవారం పరస్పరం రాచకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఉదయం జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటికి పహాడీషరీఫ్ పోలీసులు చేరుకున్నారు. ఆదివారం జరిగిన గొడవకు సంబంధించి ఇంట్లో పనిచేసే వారిని విచారించారు. ఆ తర్వాత మోహన్‌బాబు, మనోజ్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నానికి దుబాయ్ నుంచి వచ్చిన విష్ణు.. తన బౌన్సర్లను వెంటబెట్టుకొని నేరుగా జల్‌పల్లి ఇంటికి చేరుకున్నారు. ఇంటి ఆవరణలో ఉన్న మనోజ్ బౌన్సర్లను విష్ణు బయటకు పంపించే ప్రయత్నం చేయడంతో విష్ణు, మనోజ్ బౌన్సర్ల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. మనోజ్ సామాగ్రిని ఖాళీ చేయించేందుకు డీసీఎంలను కూడా సిద్ధం చేశారు.

జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి

తాజా పరిణామాలపై మంగళవారం సాయంత్రం డీజీపీ, ఇంటలిజెన్స్ డీజీలను మనోజ్ కలిసి ఫిర్యాదు చేశారు. తిరిగి జల్‌పల్లి ఇంటికి చేరుకోగా గేట్లు తీయలేదు. ఇంట్లో ఉన్న తన కూతురిని తీసుకెళ్తానంటూ గేట్లను బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. దీంతో విష్ణు తరపు బౌన్సర్లు మనోజ్‌ను, మీడియాను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇంతలో మోహన్‌బాబు ఇంట్లో నుంచి బయటకు వచ్చి మనోజ్‌పై చేయి చేసుకున్నారు. మీడియా ప్రతినిధులను దూషిస్తూ, తుపాకీ బయటకు తీసి చంపేస్తానని హెచ్చరించారు. మైక్ ముందుపెట్టి ప్రశ్నించే ప్రయత్నం చేసిన రంజిత్ అనే జర్నలిస్టు వద్ద నుంచి మైక్ లాక్కొని అతడిపైనే దాడి చేశారు. బౌన్సర్లు సైతం దౌర్జన్యం చేయడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తర్వాత మోహన్‌బాబు అస్వస్థతకు గురికావడంతో స్థానిక దవాఖానకు తరలించారు.

పోలీసుల ప్రేక్షకపాత్ర

మోహన్‌బాబు ఇంటి వద్ద ఇంత తతంగం జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. ఇరువైపులా బౌన్సర్లు ఘర్షణకు దిగినా, మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడినా అడ్డుకునేందుకు గట్టిగా ప్రయత్నించలేదు. ఉదయమంతా పోలీసులు మోహన్‌బాబుకు అనుకూలంగా వ్యవహరించారని, మనోజ్ డీజీపీ కార్యాలయానికి వెళ్లి వచ్చిన తరువాత పోలీసుల వైఖరిలో కొద్దిగా మార్పు వచ్చినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా, మోహన్‌బాబు, మనోజ్‌ల వద్ద ఉన్న లైసెన్స్‌డ్ తుపాకులను వెనక్కి తీసుకోవాలని పోలీసులకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

మోహన్‌బాబు ఇంటి వద్ద జర్నలిస్టుల ఆందోళన

మీడియా ప్రతినిధులపై మోహన్‌బాబు దాడికి పాల్పడటాన్ని నిరసిస్తూ జల్‌పల్లిలోని ఆయన ఇంటి ముందు జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. 'మోహన్‌బాబు డౌన్ డౌన్' 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. మీడియా ప్రతినిధులపై దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, తెలంగాణ జర్నలిస్టు ఫోరమ్ అధ్యక్షుడు పల్లె రవి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్షుడు మామిడి సోమయ్య, డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తదతరులు జర్నలిస్టుపై దాడిని ఖండించారు. మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మోహన్‌బాబుకు నోటీసులు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న మంచు కుటుంబ గొడవలను ఎట్టకేలకు పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరుకావాలని అదనపు డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ హోదాలో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు నోటీసులు జారీ చేశారు. ఆయనతో పాటు మనోజ్, విష్ణుకు నోటీసులు జారీ అయ్యాయి.

మనోజ్.. గుండెల మీద తన్నావు: మోహన్‌బాబు

కుటుంబ గొడవలపై మోహన్‌బాబు ఆడియో విడుదల చేశారు. 'నిన్ను అల్లారుముద్దుగా పెంచాను, చదువు కోసం చాలా ఖర్చు పెట్టాను, భార్య మాటలు విని నా గుండెలపై తన్నావు. తాగుడుకు అలవాటుపడి చెడుమార్గంలో వెళ్తున్నావు. ఇంట్లో అందరినీ ఎందుకు కొడుతున్నావు? బతుకుదెరువు కోసం వచ్చిన పనివాళ్లను కొట్టడం మహా పాపం. నీ దాడిలో కొందరికి గాయాలయ్యాయి. అన్నతో పాటు వినయ్‌ని కొట్టడానికి వచ్చావు. నీ అన్నను చంపుతానన్నావు. నా ఇంట్లోకి అడుగు పెట్టడానికి నీకు అధికారం లేదు. ఇది నా కష్టార్జితంతో కట్టుకున్న ఇల్లు. రోడ్డుకెక్కి నా పరువు తీశావు. ఆస్తులు ముగ్గురికి సమానంగా రాయాలా? వద్దా? అనేది నా ఇష్టం. జరిగిన సంఘటనతో మీ అమ్మ దవాఖానలో చేరింది. పోలీసుల సమక్షంలో నీ బిడ్డను నీకు అప్పగిస్తా' అని మనోజ్‌ను ఉద్దేశించి మోహన్‌బాబు పేర్కొన్నారు. మనోజ్ తనను కొట్టలేదని, ప్రతీ ఇంట్లో గొడవలు ఉంటాయని అన్నారు.

పోడు భూములకు సౌర విద్యుత్తు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): 'పోడు' పట్టాలు పొందిన రైతుల భూముల్లో పంపుసెట్లకు సౌర విద్యుత్తు అందజేస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడించారు. 'ప్రజావాణి' కార్యక్రమం ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి భట్టి మాట్లాడుతూ.. సౌర విద్యుత్తు పరికరాల ఏర్పాటు నిమిత్తం గిరిజన సంక్షేమ శాఖకు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరైజ్ చేసి సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని, ఆయా సమస్యల పరిష్కారం కోసం వారు తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు తెలియజేసేలా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు

- రైతులకు డ్రిప్ పరికరాలు అందజేయాలి
- అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది మార్చి నెలాఖరులోగా లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ పథకాల పురోగతిపై మంగళవారం ఆయన సచివాలయంలో సమీక్ష జరిపారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో తక్కువ పురోగతి ఉన్న కంపెనీలపై తగు చర్యలు తీసుకోవాలని, ప్లాంటేషన్ పురోగతిపై ఆయిల్ పామ్ కంపెనీలతో ప్రతి రోజూ సమీక్ష నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలవారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను మార్చిలోగా సాధించాలని చెప్పారు. ఉద్యాన పంటల కోసం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు అందజేయాలని, ఇందుకోసం రైతుల నుంచి 90 రోజులపాటు దరఖాస్తులు స్వీకరించాలని, ప్రతిరోజూ రూ.కోటి విలువైన డ్రిప్ పరికరాలు పంపిణీ చేయాలని మంత్రి ఆదేశించారు.

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

తెలుగు రాష్ట్రాల్లో రెండ్రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్రరూపం దాల్చింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గురువారం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి శ్రీలంక, తమిళనాడు తీరం దిశగా పయనిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ నెల 13 వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. 14న లేదా 15న మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు అంచనా వేస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా, హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగమంచు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నారు.

భీంపూర్‌లో 11డిగ్రీలు..

ఆదిలాబాద్, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. భీంపూర్ మండలం అర్లి(టీ)లో మంగళవారం 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలోనే అతి తక్కువ ఉష్ణోగ్రతగా రికార్డయ్యింది.

ఏడాది గడిచినా దయ రాదా?

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. ఆ ప్రాంతంలో గత 70 ఏండ్లు నివాసముంటున్న 19 కటుంబాలను ఈ ఏడాది జనవరి 29న ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పొక్లెయిన్లతో కూల్చివేసిందని బాధితులు పేర్కొన్నారు. వివేకానందనగర్ కాలనీ 1957 కన్నా ముందే ఏర్పడిందని, అప్పట్లో తమ తాత ముత్తాతలు ఇక్కడి వ్యవసాయ భూముల్లో కూలీలుగా పనిచేసేవారని బాధితులు వివరించారు. ఆ పక్కనే ఉండే భూముల్లో 30, 40 గజాల స్థలాలను కొనుక్కొని తొలుత గుడిసెలు వేసుకున్నామని, ఆ తరువాత అక్కడే పక్కా ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. 90వ దశకంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎం కోదండరెడ్డి హయాంలో జిల్లా యంత్రాంగం తమకు పట్టాలు ఇచ్చేందుకు సన్నాహాలు చేసిందని చెప్పారు.

వివేకానందనగర్ కాలనీలో ఇండ్ల కూల్చివేతలు (ఫైల్)

ఏడాది నుంచి నిరాశ్రయులే

ఇప్పటివరకు రెండుసార్లు సర్వే చేసిన రెవెన్యూ అధికారులు.. వీరిని ఆక్రమణదారులు కాదనీ, వారిలో పట్టాదారులు కూడా ఉన్నారని నివేదించారు. కానీ జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీసులు మాత్రం తమకు ఎలాంటి నోటీసులు లేకుండా, తమ ఇండ్లను కూల్చివేసి రోడ్డున పడేశారని బాధితులు తెలిపారు. పరిహారం, పునరావాసం కల్పించిన తర్వాతే ఇండ్లు నేలమట్టం చేసి, రోడ్డు విస్తరించాలని కోర్టు 2006లో ఆదేశించిందని, కానీ ఇండ్లు కూల్చివేశారు తప్ప ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తున్నారు.

దాసర్‌పల్లిలో భూకంప తీవ్రత పరిశీలన

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), డిసెంబర్ 10 : మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలం దాసర్‌పల్లి గ్రామంలో ఈ నెల 7న స్వల్ప భూకంపం వచ్చింది. దీంతో మంగళవారం భూకంప విభాగం డైరెక్టర్ సంగ్రామ్‌నాయక్, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సీనియర్ శాస్త్రవేత్త రమేశ్ గుండ గ్రామాన్ని సందర్శించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు రోజులుగా ములుగు, వరంగల్ తదితర ప్రాంతాల్లో భూకంపం వచ్చిన ప్రాంతాలను పరిశీలించామని, చివరగా దాసర్‌పల్లికి వచ్చినట్టు తెలిపారు. ఒకసారి భూకంపం వచ్చిన తరువాత.. కొన్ని రోజులు లేదా కొన్ని గంటల్లో మళ్లీ వచ్చే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇక్కడి తీవ్రతకు, గతంలో వచ్చిన వాటికి ఏమైనా సంబంధాలున్నాయా? అనే విషయాలను పరిశీలించి, రెండు, మూడ్రోజుల్లో వివరాలు వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు.

తెలంగాణ తల్లి ఆక్రోశం

మొదటిపేజీ తరువాయి...

జరిగింది. మా కుటుంబమంతా రోడ్డున పడ్డది' అంటూ లబోదిబోమని గుండెలు బాదుకున్నది. 'మేము బతుకుదెరువు కోసం జహీరాబాద్ నుంచి వచ్చి గాజులరామారంలో అద్దెకు ఉంటున్నం. నేను ఇండ్లలో బాసన్లు తోముత. నా కొడుకు సురేశ్ రోడ్డు పక్కన చిన్న డబ్బాలో పంచర్‌షాప్ పెట్టుకున్నడు. కోడలు, ఇద్దరు పిల్లలు, నా చిన్న కొడుకుతో కలిసి ఆరుగురం బతుకుతున్నం' అని వివరించింది. కాగా స్థానిక ఆటో యూనియన్ నాయకుడు, కాంగ్రెస్ నేతగా చెలామణి అవుతున్న ఓ ఒకరు పంచర్ షాపు నిర్వాహకుల వద్ద ప్రతి నెలా రూ.8వేల కిరాయి వసూలు చేస్తుండటం కొసమెరుపు.

పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

కేపీహెచ్‌బీ కాలనీలోని పుట్‌పాత్ ఆక్రమణలపై జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగం అధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. మంగళవారం కేపీహెచ్‌బీ కాలనీలోని నెక్సస్ మాల్ చౌరస్తా నుంచి గోకుల్ ప్లాట్స్ చౌరస్తా వరకు, కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్టాప్ చౌరస్తా నుంచి బ్రాండ్ ఫ్యాక్టరీ చౌరస్తా వరకు రోడ్డుకి రువైపులా పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. కేపీహెచ్‌బీ కాలనీలో పలు ప్రధాన రహదారులకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న డబ్బాలను ఒక్కసారిగా జేసీబీలతో తొలగించారు. ఆక్రమణల తొలగింపును ట్రాఫిక్ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, సీఐ జానయ్య, జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షించారు. కేపీహెచ్‌బీ కాలనీలో పలు రోడ్లపై పుట్‌పాత్ ఆక్రమణలను గుర్తించామని, వారికి ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతే తొలగించామని చెప్పారు. కేపీహెచ్‌బీ కాలనీతో పాటు అన్ని రోడ్లపై త్వరలోనే పుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పుట్‌పాత్ ఆక్రమణలను తొలగించే ప్రక్రియ నిరంతరాయం కొనసాగుతుందని స్పష్టంచేశారు.

రాజన్న కోడెల విక్రేతల అరెస్టు

మొదటిపేజీ తరువాయి...

నోటీసు ఇవ్వగా అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తికి చెందిన పసునూటి శ్యామ్‌సుందర్‌కు కోడెలు ఇచ్చామని ఈవో కార్యాలయం తెలిపింది. రాంబాబు, మంద స్వామి, శ్యామ్ సుందర్ అధికారులతో కుమ్మక్కై రైతుల సంతకాలుపెట్టి రెండు దఫాలుగా 66 లేగదూడలు, కోడెలు తీసుకొచ్చి గట్టుకిందిపల్లి పాకలో ఉంచినట్టు తేలింది. అందులో 28 కోడెలను అమ్ముకోగా, 26 కోడెలను తిరిగి వేములవాడ రాజన్న గోశాలకు అప్పగించారని, మరో 3 కోడెలు చనిపోగా, రాంబాబు వద్ద ఉన్న 9 కోడెలను మంగళవారం స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వెలుగులోకి తెచ్చిన నమస్తే తెలంగాణ

ఈ నెల 7న నమస్తే తెలంగాణ దినపత్రిక మెయిన్ ఎడిషన్‌లో 'రాజన్న కోడెలు కోతకు' శీర్షికన కథనం ప్రచురితమవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మంత్రి పేరు తెరపైకి రావడం అనేక అనుమానాలకు తావిచ్చింది. గీసుగొండ పోలీసులు విచారణచేపట్టారు. రాజన్న కోడెలు కబేళాలకు తరలింపుపై రాజన్న ఆలయంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టడంతో అక్కడి అధికారులు ఈ వ్యవహారంపై దృష్టిపెట్టారు. 5న గీసుగొండలో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్టు నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితం కావడంతో గీసుగొండలో ఈ వార్త చర్చనీయాంశంగా మారింది.

ఐదేండ్లుగా నడుస్తున్న విక్రయ వ్యవహారం

ఐదేళ్ల క్రితం అనంతారం గ్రామానికి చెందిన మంద స్వామి, మాదాసి రాంబాబు కలిసి గ్రామంలో గోశాలను ఏర్పాటు చేశారు. వేములవాడ, యాదాద్రి నుంచి కోడెలు తెచ్చి విక్రయిస్తుండగా బీజేపీ నాయకులు జాన్‌విక్రమ్, ముల్క ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ రాజు అడ్డుకోవడంతో గోశాలను మూసివేశారు. రాంబాబు అతడి పేరుతో పాటు తన కుటుంబ సభ్యుల పేర్లను సభ్యులుగా చేస్తూ శ్రీ రాజేశ్వర సొసైటీని రిజిస్టర్ చేసుకున్నాడు. సొసైటీ పేరుతో 8 నెలలుగా పలు ఆలయాల నుంచి కోడెలను తెచ్చి మనుగొండ శివారు గట్టుకిందిపల్లిలోని డీబీఎం–38 ఉప కాల్వ భూమిలో చిన్న పాక వేసి సంరక్షణ పేరుతో తెచ్చిన కోడెలను కబేళాలకు విక్రయిస్తున్నాడు. ఆలయం నుంచి 60 కోడెలు తెచ్చింది వాస్తవమేనని, అందులో కొన్ని పారిపోయాయని, మరికొన్ని చనిపోయాయని, 26 కోడెలు తిరిగి ఆలయానికి ఇచ్చానని మిగిలిన 11 తన వద్ద ఉన్నాయని రాంబాబు పొంతన లేని సమాధానాలు చెబుతూవచ్చాడు.

విచారణలో పలు విషయాలు బయటకు..

పోలీసులు మాదాసి రాంబాబు కుటుంబ నేపథ్యంపై ఆరా తీయగా మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాంబాబుది మొదటి నుంచీ అక్రమ వ్యాపారాలు చేస్తూ డబ్బు సంపాదించాలనే స్వభావం. ప్రజాప్రతినిధుల పేర్లను అడ్డుపెట్టుకొని అనేక ఆలయాల నుంచి కోడెలు, ఆవులను తెచ్చి కబేళాలకు విక్రయించే వాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఫేక్ సొసైటీ పేరుతో దందాలు చేస్తూ పోలీసులకు చిక్కాడు.

కోడెల విక్రయంపై పంచనామా

రాజన్న కోడెల విక్రయంపై గీసుగొండ పోలీసులు, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు మంగళవారం మనుగొండ శివారులోని గట్టుకిందిపల్లి రాంబాబు పాక వద్దకు వెళ్లి పంచనామా చేశారు. కోడెల చెవులకు ఉన్న ట్యాగులు పరిశీలించారు. పదకొండింటిలో కొన్నింటికి మాత్రమే ట్యాగులు ఉన్నాయని మిగతావాటికి లేవని